సాక్షి నారాయణపేట

గురువారం । 6 । ఏప్రిల్ । 2023



బావాజీ జాతర..
బావాజీ జాతర ఏర్పాట్లను బుధవారం పేట కలెక్టర్ శ్రీహర్ష పరిశీలించారు.

వివరాలు 10లో ▸



శనేశ్వరుడికి తైలాభిషేకం
నందివడ్డెమాన్‌లో శనేశ్వరస్వామికి భక్తులు తైలాభిషేకం నిర్వహించారు.

వివరాలు 10లో ▸


గరిష్టం/కనిష్టం
37.4 /25.4

వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. ఆకాశం నిర్మలంగా, అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉక్కపోత తప్పదు.

ఇఫ్తార్ 6-37
(గురువారం సాయంత్రం)
సహర్ 4-46
(శుక్రవారం తెల్లవారుజామున)
రంజాన్ వేళలు

విచారణ బోగసేనా!

అటకెక్కిన నకిలీ టీచర్ల బాగోతం
- తప్పుడు కుల ధ్రువీకరణ, దివ్యాంగపత్రాలతో ఉద్యోగాలు
- ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డిలో 200కు పైగా టీచర్లు
- 2015లో వెలుగులోకి.. 8 ఏళ్లుగా దర్యాప్తు దశలోనే..
- రాజకీయ నేతల జోక్యంతోనే తొక్కిపెట్టారా?



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన కుల్కచర్ల, మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని గండేడ్ మండలంలో పనిచేస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులు తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఉద్యోగాలు పొందారు. వీరు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కాగా.. బీసీ-డీ పత్రాలు సమర్పించి ఉద్యోగం చేస్తున్నారు. వీరిపై అప్పట్లోనే ఫిర్యాదులు రావడంతో సంబంధిత అధికారులు విచారణ చేపట్టారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిగి నియోజకవర్గంలో లింగబలిజ వర్గానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు బీసీ-ఏ కేటగిరిలో ఉద్యోగం పొందారు. వీరు బీసీ-డీ కేటగిరికి చెందుతారని.. ఓ వ్యక్తి ఇచ్చిన అర్జీకి గండేడ్ (జిల్లాల పునర్విభజనలో మహబూబ్‌నగర్ జిల్లాలో కలిసింది) మండల తహసీల్దార్ జ్యోతి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. అయినా విద్యాశాఖ విచారణ చేపట్టలేదు. ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/గండేడ్: నకిలీ బోనఫైడ్ తదితర ధ్రువపత్రాలతో కొందరు.. ఫేక్ అంధత్వ, చెవిటి వంటి దివ్యాంగ సర్టిఫికెట్లతో మరి కొందరు దర్జాగా ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువులు సాధించారు. ఇలా ఒకరు, ఇద్దరు కాదు.. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 200మందికి పైగా బోగస్ టీచర్లు ఉన్నారు. 2015 ఏప్రిల్‌లో ఇరు జిల్లాల కలెక్టర్లతో పాటు పలువురు ఉన్నతాధికారులకు ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో ఈ బోగస్ టీచర్ల బాగోతం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు విచారణ చేపట్టగా తొలుత వేగంగా.. తర్వాత మందకొడిగా.. అనంతర కాలంలో నిరుద్యోగుల ఆందోళనతో ఒకింత వేగం పుంజుకున్నప్పటికీ.. ఎటూ తేలకుండానే అటకెక్కింది. ఎనిమిదేళ్లుగా దర్యాప్తు దశలోనే ఉండగా.. రాజకీయ జోక్యంతోనే తొక్కిపెట్టారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్కడెక్కడ అంటే..
ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి రంగారెడ్డి పరిధిలోని నారాయణపేట, వనపర్తి, గద్వాల, మహబూబ్‌నగర్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన పలువురు అక్రమ మార్గాల్లో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. వీరు నారాయణపేట, గద్వాల, పెద్దమందడి, కొత్తకోట, ధన్వాడ, దేవరకద్ర, కల్వకుర్తి, ఖిల్లాఘనపూర్, కల్వకుర్తి, అడ్డాకుల, కొందుర్గు, గండేడ్, దోమ, కుల్కచర్ల, పరిగి తదితర మండలాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్నట్లు సమాచారం. మరికొంత మంది నకిలీలు 317 జీఓలో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లినట్లు తెలుస్తోంది.

జిల్లా ఆస్పత్రుల ధ్రువపత్రాలతోనే..

పీహెచ్‌సీ కోటా కింద వికలత్వ శాతం 75 ఉంటేనే అర్హులు. కానీ పది శాతం చెవిటితనం ఉన్నా వికలాంగుల కోటాలో ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించినట్లు తెలుస్తోంది. పీహెచ్‌సీ కింద ధ్రువపత్రాలు సమర్పించిన వారు స్థానిక జిల్లా ఆస్పత్రుల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందారు. నిబంధనల ప్రకారం చెవిటి అయితే ఈఎన్‌టీ ఆస్పత్రి.. అంధత్వం కలిగిన వారు సరోజిని ఆస్పత్రి.. ఆర్థోపెడిక్ అయితే హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకుని సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలి. దీంతో పాటు వీటికి మెడికల్ బోర్డు నుంచి అనుమతి పొందాలి. ఇవేమీ పట్టించుకోకుండానే పలువురు స్థానిక జిల్లా ఆస్పత్రుల నుంచి ధ్రువీకరణ పత్రాలు సృష్టించి.. వాటితోనే వికలాంగుల కోటాలో ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువుల్లో చేరారు. ఈ నకిలీల వ్యవహారంపై ఫిర్యాదులు వెల్లువెత్తిన క్రమంలో కొందరు మెడికల్ బోర్డులో పైరవీలు చేసుకుని వికలత్వం లేకున్నా.. ఉన్నట్లు ధ్రువీకరణ పత్రాలు సాధించినట్లు సమాచారం. అదేవిధంగా.. కొందరు తప్పుడు కులధ్రువీకరణ పత్రాలు సమర్పించి అడ్డదారిలో ఉద్యోగాలు చేస్తున్నారు.

పోరాటం చేస్తూనే ఉంటా..



బోగస్ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకునేవరకు పోరాటం చేస్తూనే ఉంటాను. అనేక సంవత్సరాలు ఈ అంశాన్ని నాన్చుతున్నారు. ఈ మేరకు డీఈఓ, స్టేట్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీలను బాధ్యులను చేస్తూ కోర్టులో పిటిషన్ వేశాను. తప్పుడు స్థానికత సమర్పించి ఉద్యోగం కోల్పోయి.. తిరిగి ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయుడిపై కూడా సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశాను. ఓట్లకోసం రాజకీయ నాయకులే విచారణను తొక్కిపెడుతున్నట్లు తెలుస్తోంది.

– దిడ్డికాడి గోపాల్, రాష్ట్ర సమాచార హక్కుల వేదిక అధ్యక్షుడు, మహమ్మదాబాద్

రంగారెడ్డిలో 51.. పాలమూరులో 84

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 51 మంది నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్నారని.. చెవిటి, అంధత్వం లేకున్నా బోగస్ ధ్రువపత్రాలతో ఉపాధ్యాయ కొలువు చేస్తున్నారని డీఈఓ, కలెక్టర్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్లకు ఫిర్యాదులు అందాయి. అప్పటి జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు వీరి ధ్రువపత్రాలు పరిశీలించి వాస్తవాలు తెలపాలని మెడికల్ బోర్డును కోరారు. వారిచ్చిన వివరాల ఆధారంగా 12 మందిని తొలగించారు. ఆ తర్వాత మిగతా వారి విచారణ మరుగున పడింది. అదేవిధంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మూడేళ్ల క్రితం ఫిర్యాదులు అందాయి. 84మంది ఉపాధ్యాయుల అయా పాఠశాలల్లో ఆయా కేటగిరిలో తప్పుడు ధ్రువపత్రాలు పొంది ఉద్యోగాల్లో చేరినట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత డీఈఓలు మారుతున్నారే తప్ప.. విచారణ చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

హనుమాన్ జయంతి ఉత్సవాలకు బందోబస్తు

- ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో నిర్వహించే హనుమాన్ జయంతి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు చెప్పారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 71చోట్ల జరిగే శోభాయాత్ర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పోలీసులు సూచించిన మార్గంలో ర్యాలీలు చేపట్టాలని, డీజేలు వాడరాదని, టపాకాయలు కాల్చరాదని అన్నారు. ఇతర మతస్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూసుకోవాలని, రెచ్చగొట్టే పాటలు, వ్యాఖ్యలు చేయరాదన్నారు. జెండా కర్రలు రెండు అడుగులకు మించరాదని, మద్యం, మత్తు పదార్థాలు ఉపయోగించకూడదని చెప్పారు. సోషల్ మీడియాలో వ్యతిరేక పోస్టులు పెట్టరాదని, సాధారణ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

అడిషనల్ ఎస్పీగా నాగేంద్రుడు



నారాయణపేట రూరల్: జిల్లా నూతన అడిషనల్ ఎస్పీగా కే.నాగేంద్రుడు నియమితులయ్యారు. రాచకొండ కమిషనరేట్‌లో డీఎస్పీ (ఏసీపీ)గా పనిచేసి పదోన్నతిపై నారాయణపేటకు వచ్చారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లును కలుసుకుని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అయితే గతంలో ఇక్కడ పనిచేసిన అడిషనల్ ఎస్పీ భరత్ ఆరునెలల క్రితం నాగర్‌కర్నూల్‌కు బదిలీ అయ్యారు.

న్యూస్‌రీల్

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



నారాయణపేట రూరల్: అత్యవసర సమయంలో ప్రాణాపాయం నుంచి కాపాడటానికి ప్రతి ఒక్కరికీ సీపీఆర్ విధానంపై అవగాహన ఉండాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ భవనంలో బుధవారం సీపీఆర్‌పై వైద్యులు, ఆశా కార్యకర్తలు, పోలీసులు, ఆర్టీసీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లుతో కలిసి సమావేశంలో మాట్లాడారు. ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో వచ్చిన మార్పులకు గుండె సంబంధ వ్యాధులు పెరిగిపోతున్నాయని చెప్పారు. ఎక్కడైనా చాతిలో నొప్పితో బాధపడుతుంటే వెంటనే సీపీఆర్ ప్రక్రియను చేపట్టాలన్నారు. దీనిపై వైద్యబృందం అవగాహన కల్పించారు. చాతి ఎడమభాగంలో చేతులతో ఒత్తిడి పెంచి కృత్రిమ శ్వాసను అందించాలని సూచించారు. అగ్నిశాఖల సిబ్బంది, అత్యవసర విభాగంలో పనిచేసే వారికి మొదటి విడతలో అవగాహన కల్పిస్తారని, క్రమంగా అందరికీ తెలియజేస్తామన్నారు. అనంతరం సీపీఆర్‌కు సంబంధించిన బ్రోచర్ విడుదల చేశారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాంమనోహర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, వైస్ చైర్మన్ హరినారాయణ్‌భట్టడ్, ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ అంజలి, కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష విధుల్లో కఠినంగా వ్యవహరించాలి

నారాయణపేట రూరల్: జిల్లాలో టెన్త్ పరీక్షలకు హాజరవుతున్న సీఎస్, డీఓతో పాటు ఇన్విజిలేటర్లు తమ విధులను కఠినంగా నిర్వహించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన క్యార్యదర్శి జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. పరీక్ష విధుల్లో అవకతవకలు చోటుచేసుకోకుండా అన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం పదో తరగతి పరీక్షలను రాజకీయం చేస్తున్నారని, వారి ఉచ్చులో టీచర్లు పడరాదని అన్నారు. ఉపాధ్యాయుల ప్రతిష్ఠ పెంచే విధంగా నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఎవరి ప్రలోభాలకు గురికారాదని, విధుల వరకు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, రఘువీర్, సత్యనారాయణరెడ్డి, మొల్గాన్‌జనార్దన్, విశ్వనాథ్, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాములోరి కల్యాణ తలంబ్రాలు అందజేత



స్టేషన్ మహబూబ్‌నగర్: భద్రాద్రి శ్రీసీతారాముల కల్యాణ తలంబ్రాలు పంపిణీ కార్యక్రమాన్ని ఆర్టీసీ కార్గో లాజిస్టిక్స్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో బుధవారం ప్రారంభించారు. మొదటగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ జి.రవినాయక్, ఎస్పీ కె.నరసింహలకు కార్గో ఏటీఎం దేవేందర్‌రెడ్డి తలంబ్రాలు అందజేశారు. తలంబ్రాలకు ప్రజల నుంచి విశేషమైన స్పందన రావడంతో ఈనెల 10వ తేదీ వరకు బుకింగ్ చేయడానికి గడువు పొడిగించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆసక్తి గల భక్తులు ఆర్టీసీ బస్టాండ్‌లోని లాజిస్టిక్ సెంటర్, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లకు రూ.116 చెల్లించి బుకింగ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మహేష్‌కుమార్, ఇతర డిపోల ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలి



డ్రోన్ స్ప్రే యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట రూరల్: మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్తగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నూతనంగా కొనుగోలు చేసిన డ్రోన్ స్ప్రే యంత్రాన్ని బుధవారం స్థానిక సింగారం స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ పొలాల్లో మందు పిచికారీ చేయడానికి తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణం పూర్తి చేయడానికి ఉపకరిస్తుందని, మానవ రహిత యంత్రం కావడంతో అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడుతుందన్నారు. 15నిమిషాల్లోపు ఎకరానికి మందు స్ప్రే చేయడానికి ఆస్కారం ఉందని, పంట మొత్తానికి సమానంగా మందు అందుతుందన్నారు. కూలీల కొరత, రైతులకు హానికర ప్రభావాలకు చెక్ పెట్టేందుకు ఉపకరిస్తుందన్నారు. దీంతో సమయం, ఖర్చుసైతం ఆదా అవుతుందన్నారు. అదేవిధంగా విస్తృతంగా ప్రచారం చేసి పెద్దఎత్తున మిషనరీని అద్దెకు వాడుకునే విధంగా చూడాలన్నారు. మహిళా సంఘాలకు నష్టం రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ అంజలి, అడిషనల్ డీఆర్‌డీఓ అంజయ్య, డీపీఎం జయన్న, మహిళా సమైక్య అధ్యక్షురాలు చంద్రకళ, ఏపీఎం శకుంతల, సీసీలు బస్వరాజు, వసంత, శ్రీదేవి, సుమతి, కీర్తి, షరీఫ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై విమర్శలు తగవు

- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: బీజేపీ నాయకులకు ధైర్యం ఉంటే తమతో రాజకీయంగా కొట్లాడాలని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడడం తగదని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మక్తల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదో తరగతి విద్యార్థుల జీవితాలను పణంగా పెట్టి బీజేపీ క్షుద్ర రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. బండి సంజయ్ అడ్డంగా దొరికిపోయినా, మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయాల కోసం భవిష్యత్తు తరాల జీవితాలతో ఆడుకోవడం సమంజసం కాదన్నారు. బీజేపీ నాయకుల తీరును ప్రజలు గమనిస్తున్నారని, తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. వారే పేపర్ లీకేజీకి పాల్పడి ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారని, చూస్తూ ఊరుకోమన్నారు. బీజేపీ అంటేనే విద్వేషాలు రెచ్చగొట్టడానికి కేరాఫ్ అడ్రస్ అన్నారు. ఆ పార్టీని ఎవరూ నమ్మవద్దని అన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు

- ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట రూరల్: విద్యార్థుల జీవితాలను పణంగా పెట్టి రాజకీయాలకు వాడుకోవడం బీజేపీకి సరికాదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. టెన్త్ పరీక్ష పత్రాలను బయటకు తెచ్చి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అయోమయానికి గురిచేస్తున్నారని వాపోయారు. ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రభుత్వాన్ని అస్థిర పర్చాలనే కుట్రతో బీజేపీ వరుసగా కులం, మతాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేసిందని, దేవుళ్ల పేరుతో ప్రజలను విడదీసిందని విమర్శించారు. తెలంగాణలో ఎమ్మెల్యేల కొనుగోలుతో పాటు దర్యాప్తు సంస్థల ద్వారా నాయకులను ఇబ్బందిపెట్టే కుట్ర ఫలించకపోవడంతో విద్యార్థుల వైపు దారి మళ్లించారని విమర్శించారు. మోదీ ఏడాదికి రెండు ఉద్యోగ ప్రకటనలు ఇస్తామని మోసం చేశారని, తెలంగాణలో రెండలక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తే బండి సంజయ్ జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. ప్రశ్నపత్రాన్ని బండి సంజయ్ సెల్‌కు ఎందుకు పంపారనే విషయంపై క్లారిటీ ఇవ్వాలని, తన ఇంట్లో టెన్త్ పరీక్షలు రాసే పిల్లలు లేరు.. పరీక్ష పత్రాల వ్యాపారం చేయడం లేదు కదా. మరి ఎందుకు తనకు వచ్చిందో బహిరంగంగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు విజయ్‌సాగర్, వేపూరిరాములు, నాయకులు పాల్గొన్నారు.

'తపస్‌పై నిందలు సరికాదు'

నారాయణపేట రూరల్: పదో తరగతి పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారంలో తపస్ ఉపాధ్యాయ సంఘంపై నిందలు మోపుతూ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ పళ్ల రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడటం సరికాదని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి జాతీయ భావజాలం, నైతిక విలువలు కలిగిన ఉపాధ్యాయ సంఘాన్ని అబాసుపాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పేపర్ లీకేజీకి కారణాలను పూర్తిస్థాయిలో తెలుసుకుని ప్రెస్‌కు వివరిస్తే బాగుండేదని అన్నారు. బందెప్పను తపస్ బాధ్యుడని చూయిస్తూ, అతని వల్లనే పేపర్ లీక్ అయ్యిందని చెప్పడం దారుణమన్నారు. వెంటనే తమ మాటలను వెనక్కి తీసుకోవాలని, సంఘానికి క్షమాపణలు చెప్పాలన్నారు.

వస్తున్నాం.. లింగమయ్య

- వైభవంగా ప్రారంభమైన నల్లేశ్వరం ఉత్సవాలు
- మొదటిరోజే వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- నల్లమలలో మార్మోగిన శివనామస్మరణ
- వసతుల లేమిపై భక్తుల అసహనం

– మన్ననూర్



- వివరాలు 8లో..

జగ్జీవన్‌రాం సేవలు ఆదర్శనీయం



నారాయణపేటలో నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట రూరల్: అట్టడుగువర్గాల అభివృద్ధికి డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం చేసిన సేవలు ఆదర్శనీయమని జెడ్పీ చైర్‌పర్సన్ వనజ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం 116వ జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీహర్ష, ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డితో కలిసి బాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. దళితుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని, దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. మహనీయుల త్యాగాలను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. ఈనెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన జీవిత విశేషాలను తెలిపే పుస్తకాన్ని అన్ని పాఠశాలల విద్యార్థులకు అందిస్తామన్నారు. అనంతరం కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ హరినాథ్‌రెడ్డి, జిల్లా అధికారి కన్యాకుమారి, ఉద్యానవన శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు, అధికారులు, కులసంఘాల ప్రతినిధులు ఉన్నారు.

బండి సంజయ్ అరెస్టు అక్రమం



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

నారాయణపేట రూరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌ను అక్రమంగా అరెస్టు చేశారని బీజేపీ నాయకులు అన్నారు. పోలీసుల తీరుకు నిరసనగా నారాయణపేటలో ఆ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్‌చౌరస్తాలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా లిక్కర్‌స్కామ్, పరీక్ష పేపర్ల లీకేజీ వ్యవహారాలతో తెలంగాణ ప్రజల జీవితాలతో ఆడుకుంటోందని విమర్శించారు. టెన్త్ ప్రశ్నపత్రాలు బయటకు రావడం ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. ప్రజలదృష్టి మరల్చడానికే బండి సంజయ్‌ను అరెస్టు చేయించారని ఆరోపించారు. అక్రమ కేసులను భేషరతుగా తొలగించి, విడుదల చేయాలని, లేకపోతే ఉద్యమిస్తామన్నారు. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు బీజేపీ నాయకులు, కార్యకర్తలను అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. ఈక్రమంలో నాయకులు, పోలీసుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. సీఐ రవిబాబు కల్పించుకుని సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. రఘురామయ్యగౌడ్, ప్రభాకరవర్ధన్, రఘువీర్‌యాదవ్, నందునామాజి, లక్ష్మి, రాము, శ్రీనివాస్, బీంసేన్‌జోషి పాల్గొన్నారు.

జోరుగా ఉల్లి విక్రయాలు

దేవరకద్ర: స్థానిక మార్కెట్ బుధవారం సెలవు అయినా.. జోరుగా ఉల్లి విక్రయాలు కొనసాగాయి. వివిధ గ్రామాల నుంచి రైతులు తెచ్చిన ఉల్లిని కొందరు వ్యాపారులు నేరుగా కొనుగోలు చేసి బస్తాలుగా విక్రయాలు సాగించారు. బాబు జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా మంగళవారమే ఉల్లి వేలం నిర్వహించారు. ఇందులో క్వింటాల్ ధర గరిష్టంగా రూ.1,040, కనిష్టంగా రూ.500 ధర పలికింది. కాగా.. బుధవారం రైతులు తెచ్చిన ఉల్లిని వ్యాపారులు నేరుగా కొనుగోలు చేశారు. మార్కెట్ బయట 45 కేజీల ఉల్లి బస్తాను గరిష్టంగా రూ.650, కనిష్టంగా రూ.450 వరకు విక్రయించారు.

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

మానవపాడు: జాతీయ రహదారి 44పై బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలకేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లాకు చెందిన వెంకటస్వామి(37) హైదరాబాద్‌కు టైల్స్ పనిపై పది రోజుల క్రితం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్‌కు వస్తుండగా జాతీయ రహదారిపై మానవపాడు స్టేజి, జల్లాపురం స్టేజి మధ్యలో బైక్ అదుపుతప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం హైవే అంబులెన్స్‌లో తరలించారు. ఆయన భార్య శ్రీమతికు మారి, కుమారుడు, కూతురు ఉంది.

వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

ఊట్కూరు: వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లెపల్లికి చెందిన శంకరప్ప కూతురు లక్ష్మి (28)ని అదే గ్రామానికి చెందిన బాలరాజుతో మూడేళ్ల క్రితం వివాహమైంది. కొంత కాలంగా భర్త, అత్త యశోదమ్మ, మామ కిష్టప్ప అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారు. బుధవారం ఉదయం ఇంట్లో గొడవలు కావడంతో మనోవేదనకు గురై పురుగు మందు తాగింది. కుటుంబసభ్యులు మక్తల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. వీరికి కూతురు ఉంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాములు తెలిపారు.

చదువుకోవాలని మందలించడంతో..

విద్యార్థి బలవన్మరణం


బాలకృష్ణ (ఫైల్)

మదనాపురం: చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని అజ్జకొల్లులో చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథరెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రవి, రాధకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు బాలకృష్ణ కొత్తకోటలోని ప్రైవేట్ స్కూల్‌లో 9వతరగతి చదువుతున్నాడు. కాగా బాగా చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో సోమవారం ఉదయం మనస్థాపం చెంది పురుగు మందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన కారు



మరికల్: రోడ్డు పక్కన హోటళ్లోకి కారు దూసుకెళ్లింది. దీంతో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం ఎలిగండ్లలో చోటుచేసుకుంది. అదే గ్రామంలో వడ్డె బాలమ్మ అనే మహిళ మృతి చెందడంతో అంత్యక్రియలకు వచ్చిన ధన్వాడ మండలం రాంకిష్టాయ్యపల్లికి చెందిన వడ్డె మణెమ్మ హోటల్‌లో టిఫిన్ చేస్తుండగా కారు దూసుకువచ్చింది. ఆమెతో పాటు ఎలిగండ్లకు చెందిన పద్మమ్మ గాయపడ్డారు. వీరిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ఎలిగండ్లలో ఎల్లమ్మ దేవత బండారోత్సవాలకు హాజరయ్యేందుకు బంధువుల ఇంటికి దేవరకద్ర నుంచి కారులు వచ్చారు. ప్రస్తుతం వారు పరారీలో ఉన్నారని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు అపహరణ

బాలానగర్: కూలీకి వెళ్తున్న మహిళ మెడలోంచి పుస్తెలతాడు ఎత్తుకెళ్లిని సంఘటన మండలంలోని వీరన్నపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ జయ ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని వీరన్నపల్లికి చెందిన పట్నం అమృత ఉదయం 9గంటలకు ఈజీఎస్ పనులకోసం వెళ్తుండగా, బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అడ్రస్ అడిగారు. ఆమెను మాటల్లో ఉంచి మెడలో ఉన్న 3.5 తులాల బంగారు పుస్తెలతాడును ఎత్తుకుని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అర్ధరాత్రి ఇంట్లో చోరీ

దామరగిద్ద: ఇంట్లో నగదు, నగలు ఎత్తుకెళ్లిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని చాకలోన్‌పల్లికి చెందిన బొంత నరేష్ కుటుంబ సభ్యులు ఎప్పటిలాగే ఆరుబయట నిద్రపోయారు. వెనక వైపు ఉన్న డోరు నుంచి గుర్తుతెలియని దుండగులు తులుపులు ఊడదీసి చోరీకి పాల్పడ్డారు. ఉదయం లేచి చూసి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. రెండున్నర తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.1.10 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై బాధితుడు నరేష్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బుధవారం రాత్రి యల్సన్‌పల్లికి చెందిన మాణిక్యప్ప ఇంట్లో చోరీ జరిగినట్లు బాధితుడు తెలిపారు.


కర్ర సహాయంతో బాలిక..



సలేశ్వరం లింగమయ్య దర్శనానికి అడవిలో నడిచి వెళ్తున్న సన్యాసులు, భక్తులు


పార్కింగ్ స్థలంలో నిలిపిన ప్రైవేట్ వాహనాలు


మహిళ సహాయంతో వస్తున్న వృద్ధురాలు


చిన్నారిని భుజంపై ఎత్తుకుని వస్తున్న భక్తుడు

వస్తున్నాం.. లింగమయ్య

వైభవంగా ప్రారంభమైన సలేశ్వరం ఉత్సవాలు

- మొదటిరోజే వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- నల్లమలలో మార్మోగిన శివనామస్మరణ
- వసతుల లేమిపై భక్తుల అసహనం

మన్ననూర్: తెలంగాణ అమరనాథ్‌గా ప్రసిద్ధిగాంచిన సలేశ్వరం లింగమయ్య స్వామి ఉత్సవాల సందర్భంగా అటవీ మార్గమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. చైత్ర శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని నల్లమల లోతట్టు ప్రాంతంలో ప్రతిఏటా నిర్వహించే సలేశ్వరం ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అనాదిగా చెంచులే పూజారులుగా కొనసాగుతున్న ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. 'వస్తున్నాం.. వస్తున్నాం.. లింగమయ్యా..' భక్తుల అన్న నినాదాలతో నల్లమలలోని కొండలు, లోయలు మార్మోగుతున్నాయి. గత రెండేళ్ల క్రితం కరోనా ప్రభావంతో ఉత్సవాలు అంతగా జరగలేదు. ఈ ఏడాది అంతా అనుకూలంగా ఉందనుకున్న సమయంలో అధికారులు నిర్ణయించిన గడువుకు ఒకరోజు ముందే వేల సంఖ్యలో భక్తులు తరలి వస్తుండటాన్ని అటవీశాఖ అధికారులు, పోలీసులు అదుపు చేయలేకపోయారు. దీంతో తప్పనిసరి పరిస్థితిలో బుధవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల నుంచే లింగమయ్యను దర్శించుకునేందుకు భక్తులకు అనుమతిచ్చారు. ప్రశాంత వాతావరణంలో, చల్లని ఆనందాన్నిచ్చే కొండల నడుమగా ప్రవహించే జలపాతాలను అనుసరిస్తూ చిన్నపిల్లలు, వృద్ధులు సైతం అత్యంత ప్రమాదకరంగా ఉన్న కొండ చరియల నడుమ కొలువుదీరిన లింగమయ్య స్వామిని దర్శించుకోవడానికి తరలివెళ్లారు. సలేశ్వరం ఉత్సవాలు మూడు రోజుల పాటు జరుగుతున్నటికీ బుధవారం మొదటిరోజే లక్ష మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని అంచనా.

భక్తులకు అన్నదానాలు

భక్తుల సౌకర్యార్థం కోసం అనేక స్వచ్ఛంద సంస్థలు సలేశ్వరం ముఖ్య కూడలి మోకాళ్ల కురువ వద్ద దాతలు అన్నదాన సత్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం అల్పాహారం మొదలుకొని మధ్యాహ్నం, రాత్రి సమయంలో భోజనాలు, రాగి గటుక, మజ్జిగ, తాగునీటి సౌకర్యాలను కల్పిస్తున్నారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య, ఆరోగ్య, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అందుబాటులో శిబిరాలను ఏర్పాటు చేశారు. పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపడుతున్నారు.

ఆదాయంపైనే దృష్టి..

వాహనాల రాకపోకలకు సంబంధించి కనీస సౌకర్యాలు కూడా కల్పించని అటవీశాఖ అధికారులు ఆదాయంపైనే పూర్తిగా దృష్టిసారించడం ఆశ్చర్యంగా ఉంది. ప్రజల భాగస్వామ్యంతోనే అడవులు, వన్యప్రాణుల మనుగడ అని చెప్పుకొచ్చే సంబంధిత అధికారులు భక్తులు, ప్రజల నుంచి టోల్‌గేటు పేరుతో రూ.లక్షలు వసూలు చేస్తూ కనీసం తాగునీరు, సునాయసంగా రహదారి గుండా వెళ్లేందుకు మరమ్మతు చేపట్టకపోవడం ఏమిటని పలువురు భక్తులు ప్రశ్నిస్తున్నారు.


రాళ్ల గుట్టపై భక్తులు


సలేశ్వరంలో జలధార వద్ద స్నానమాచరిస్తున్న భక్తులు


గుండం వద్ద భక్తుల రద్దీ

80 ప్రత్యేక బస్సులు..

ఈసారి సలేశ్వరం ఉత్సవాలకు ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. నాగర్‌కర్నూల్, అచ్చంపేట మార్గంలో ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు చొప్పున ప్రయాణ సౌకర్యం కల్పించారు. నాగర్‌కర్నూల్ డిపో నుంచి 25 బస్సులు, అచ్చంపేట నుంచి 20, కొల్లాపూర్, కల్వకుర్తి, వనపర్తి డిపోల నుంచి 6–8 బస్సుల చొప్పున కేటాయించారు. సలేశ్వరం లింగమయ్యను దర్శించుకునేందుకు భక్తులు ఎక్కువగా ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడంతో ప్రయాణికులతో బస్సులన్నీ కిటకిటలాడాయి.

రేషన్ బియ్యం డీసీఎం పోలీసులకు అప్పగింత


బియ్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ అధికారి, పోలీసులు

వనపర్తి క్రైం: జిల్లాకేంద్రంలోని మారుతి రైస్‌మిల్లు నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు బుధవారం జిల్లా టాస్క్‌ఫోర్స్, పట్టణ పోలీసులు దాడులు చేసి, తనిఖీలు చేపట్టారు. రైస్‌మిల్లు నుంచి డీసీఎంలో 197 బస్తాల బియ్యాన్ని తరలించడంపై జిల్లా సివిల్ సప్లయ్ అధికారి సుదర్శన్‌కు పోలీసులు సమాచారం అందించారు. ఆలస్యంగా అక్కడికి చేరుకున్న సివిల్ సప్లయ్ అధికారి డీసీఎంలో ఉన్న బియ్యం బస్తాలు, మిల్లులో ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. ఒకరి పేరు మీద అనుమతి ఉంటే నీ మిల్లు నుంచి ఎలా బియ్యాన్ని తరలిస్తావని సదరు అధికారి మిల్లు యజమానిని నిలదీశారు. పోలీసుల సమక్షంలో 197 సంచుల బియ్యం బస్తాలు ఉన్న డీసీఎంను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించి పోలీసులకు అప్పగించారు. డీసీఎంలో ఉన్నది రేషన్ బియ్యమా..? మిల్లింగ్ చేసిన బియ్యామా అనేది టెక్నికల్ అధికారి ద్వారా పరిశీలించి, వివరాలు వెల్లడిస్తామని సివిల్ సప్లయ్ అధికారి చెప్పారు.

మహిళపై లైంగికదాడి

- కేసు నమోదు

నవాబుపేట: ఒక మహిళపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన నవాబుపేట మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని కిషన్‌గూడకి చెందిన 30ఏళ్ల మహిళను పోమాల్ గ్రామానికి చెందిన గణేష్, లోకిరేవుకి చెందిన మహేష్ మంగళవారం రాత్రి బాధితురాలిని గ్రామం నుంచి బైక్‌పై నవాబుపేట, లోకిరేవు గ్రామాల మధ్యలో రోడ్డు పక్కకు తీసుకెళ్లారు. బలవంతంగా మద్యం తాగించి ఒకరి తరువాత ఒకరు లైంగిక దాడికి పాల్పడ్డారు. అనంతరం ఆ మహిళ కాళ్ల కడియాలు చోరీ చేసుకొని పారిపోయారు. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో మహేష్, గణేష్‌పై కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. కాగా నిందితుల దగ్గర వెండి కడియాలు స్వాధీనం చేసుకున్నామని, బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆగి ఉన్న లారీలో డీజిల్ చోరీ


డీజిల్ దొంగిలించబడిన లారీ

కోస్గి: ఆగిన ఉన్న లారీలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డీజిల్ చోరీ చేశారు. ఈ సంఘటన పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. పట్టణంలోని బహార్‌పేటకు చెందిన ఇసూబ్ తన సొంతలారీలో మంగళవారం తవుడు సంచులను కర్ణాటక రాష్ట్రంలోని రాయిచూర్‌లో అన్‌లోడ్ చేసి కోస్గికి వచ్చాడు. కర్ణాటకలో డీజిల్ ధర తక్కువగా ఉండటంతో రూ.38,000ల డీజిల్‌తో ట్యాంక్ ఫుల్ చేయించాడు. మంగళవారం రాత్రి బహార్‌పేటలోని చెక్‌పోస్ట్ సమీపంలో లారీని పార్క్ చేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం మళ్లీ లోడింగ్‌కు లారీని తీసే క్రమంలో డీజిల్ ట్యాంక్ తెరిచి ఉండటాన్ని గుర్తించాడు. లోపల పరిశీలించగా మొత్తం డీజిల్ దొంగిలించినట్లు నిర్ధారించుకున్నాడు. పోలీసు శాఖ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో, సమీపంలోని ఓ ఇంటి యజమాని ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను పరిశీలించాడు. అర్ధరాత్రి కారులో వచ్చిన కొందరు డీజిల్ దొంగిలించిన దృశ్యాలు నమోదయ్యాయి. దూరం ఎక్కువగా ఉండటంతో కారు నంబర్ సరిగా గుర్తించలేకపోయామని, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు ఇసూబ్ తెలిపాడు.

అల్లం సాగుతో లాభాలు


4 నెలల అల్లం పంట

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: వ్యవసాయంలో కొత్త పంటల సాగుపై రైతుల ఆసక్తి కనబరుస్తున్నారు. సాంప్రదాయ పంటల సాగులో వస్తున్న నష్టాల నుంచి గట్టెక్కడానికి రైతులు వాణిజ్య పంటల వైపు దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఆ కోణంలోనే అల్లం పంట సాగు చేసి లాభాలను ఆర్జిస్తున్నారు. ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు అల్లం పంట సాగుపై అందించిన సూచనలు, సలహాలు.

అనువైన నేలలు

అల్లం సాగుకు ఎర్ర నేలలు అనువగా ఉంటాయి. నీరు నిల్వ ఉండని నేలల్లో పంట సాగు అనుకూలం. వరి సాగుతో పోల్చితే నీటి వినియోగం చాలా తక్కువ. ఎకరా పొలంలో వరి సాగు చేయడానికి కావాల్సిన నీటితో ఒక్కటిన్నర ఎకరంలో అల్లం సాగు చేసుకునే వెసులుబాటు ఉంటుంది.

రకాలు–లభ్యత

మారన్ విత్తనాలు మంచి దిగుబడిని ఇస్తాయి. వీటిని కేరళ నుంచి తెప్పించుకోవాల్సి ఉంటుంది. మహావ రకం మహారాష్ట్రలో లభిస్తుంది. ఇవేకాక కేరళలో ఎర్నాడ్, వేనాడ్, కరుప్పం పాడి, నడియా రకాలు ప్రసిద్ధి చెందినవి. పంట 8 నుంచి 9నెలల్లో చేతికి అందుతుంది. పంట కాలం తర్వాత మార్కెట్‌కు తరలించుకోవచ్చు.

దుక్కి ఇలా..

దుక్కి చాలా ముఖ్యమైనది. దుక్కిని 30 సెం.మీ. లోతు వరకు దున్నుకోవాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 10 ట్రక్కుల బాగా చిలికిన పశువుల ఎరువు, 150 కిలోల సూపర్, 30 కిలోల పొటాష్ వేసుకోవాలి. కనీసం 30 సెం.మీ. ఎత్తు, బోదే పైభాగం, 90 సెం.మీ. ఉండేలా 4 అడుగుల వెడల్పుతో బోదేలు తయారు చేసుకోవాలి. నీటి తడుల కోసం బోదెల మధ్య ఇన్‌లైన్ డ్రిప్ అమర్చుకోవాలి.

విత్తన మోతాదు

ఎకరానికి వెయ్యి కిలోల విత్తనాలు కావాల్సి ఉంటుంది. 20 రోజులపాటు కుప్పగా వేసి మండె కట్టాలి. తర్వాత చిన్న మొలకలు రాగానే 30 గ్రాముల బరువు ఉండేలా కత్తిరించాలి. వీటిని లీటర్ నీటికి 3 గ్రాముల మాంకోజెబ్, 2 మిల్లీ లీటర్ల క్లోరోఫైరిపాస్ కలిపి 30 నిమిషాలు నానబెట్టి భూమిలో విత్తాలి. 3–5 వారాల్లో పూర్తిగా మొలక వస్తుంది. రోజు 6 గంటల పాటు డ్రిప్‌తో నీటిని అందించాలి. రైతులు జూన్ మాసంలోనే అల్లం పంట సాగు చేసుకోవచ్చు. నీటి పారుదల ఉంటే ఫిబ్రవరిలో లేదా మార్చి నెలలో నాటుకోవచ్చు.

ఎరువులు

పిలక దశలో నాలుగు నెలలు యూరియా 20:20 ఎరువులు రోజు మార్చి రోజు డ్రిప్ ద్వారా అందించాలి. దుంప ఎదుగుదల దశలో 13:0:45 ఎరువులను 3 నుంచి 5 నెలల వరకు నెలకోసారి ఇవ్వాలి. మెగ్నీషియం సల్ఫేట్, కాల్షియం నైట్రేట్ ఇవ్వాలి.

తెగుళ్ల యాజమాన్యం

అల్లం సాగులో ప్రధానంగా దుంప కుళ్లు, బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగుళ్లు. వీటి వలన 30 నుంచి 50 శాతం వరకు పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. దుంప కుళ్లును గుర్తించినట్లయితే మెటలాక్సిల్ ఒక గ్రాము లీటర్ నీటిలో కలిపి వేరు ప్రాంతం తడిచేలా పోయాలి. ఈ విధంగా పది రోజుల వ్యవధిలో రెండు సార్లు చేయాల్సి ఉంటుంది.

వేడి గాలుల నుంచి రక్షణ

అల్లం మొలకెత్తిన తర్వాత బోదెలకు రెండు వైపులకు కింద భాగంలో 30 సెంటీమీటర్ల దూరంలో మొక్కజొన్న నాటుకోవాలి. దీని వలన పిలక దశలో అల్లం పంటను వేడి గాలులు, అధిక ఉష్ణోగ్రతల నుంచి కాపాడుకోవచ్చు.

కుక్కల దాడిలో 50 గొర్రెపిల్లలు మృతి



పాన్‌గల్: కుక్కల దాడిలో 50 గొర్రెపిల్లలు మృత్యువాతపడ్డాయి. కాపరుల కథనం ప్రకారం.. మండలంలోని జమ్మాపూర్‌కు చెందిన బాలపీరు, రమేష్, ఎల్లయ్యలు తమ గొర్రెలను నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం వట్టిపల్లికి గొర్రెలను మేపుల కోసం తీసుకెళ్లారు. ఈ క్రమంలో బుధవారం గొర్రె పిల్లలను వలలో ఉంచి గొర్రెలను మేపుల కోసం వెళ్లారు. మేతకు వెళ్లిన కాపరులు తిరిగి వచ్చి చూడగా వలల ఉన్న 50 గొర్రెపిల్లలు కుక్కల దాడిలో చనిపోయినట్లు గుర్తించారు. వీటి విలువ దాదాపు రూ.4 లక్షల వరకు ఉంటుందని, తమను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కాపరులు కోరారు.

కుక్కలదాడిలో 40 గొర్రెపిల్లలు మృతి

కోడేరు: కుక్కల దాడిలో 40 గొర్రెపిల్లలు మృతి చెందాయి. ఈ సంఘటన కోడేరు మండలం నర్సాయిపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. ఆ సంఘటన వివరాలు.. నర్సాయిపల్లికి చెందిన శరబంద, రమేష్ కలిసి వ్యవసాయ పొలంలో గొర్రెలమందను ఆపారు. 40 చిన్న గొర్రెపిల్లలు ఉండడంతో ఆ గొర్రెపిల్లలను వలలో వేసి ఉదయం గొర్రెల మందను మేపడానికి వెళ్లారు. మధ్యాహ్నం ఎవరూలేని సమయంలో కుక్కలు మందపై దాడిచేశాయి. 40 గొర్రెపిల్లలను కొరికి చంపాయి. శరబంద, రమేష్ సాయంత్రం వచ్చి చూడగా గొర్రెపిల్లలు మృత్యువాత పడ్డాయి. దీంతో సుమారు రూ.2లక్షలు వరకు నష్టం జరిగిందని వాపోయారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డుపై నిలిపిన వాహనాన్ని ద్విచక్ర వాహనదారుడు వెనుక నుంచి ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డాడు. మహబూబ్‌నగర్ రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్–జడ్చర్ల రోడ్డుపై టీబీ ఆస్పత్రి సమీపంలో బుధవారం ఏపీ 22టీఏ 1110నంబర్ కలిగిన బొలెరో వాహనం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా రోడ్డు మధ్యలో నిలిపాడు. దీంతో వెనుక నుంచి టీఎస్ 06 ఎఫ్ఈ 4394 నంబర్ ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతనిడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా...

పిడుగుపాటుకు ఎనిమిది పశువులు మృతి



గుండాల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పిడుగులు పడడంతో ఆళ్లపల్లి మండలం సుద్దరేవు గ్రామంలో మూడు ఆవులు, కిచ్చెనపల్లిలో నాలుగు ఆవులు, ఒక దుక్కిటెద్దు మృత్యువాతపడ్డాయి. మధ్యాహ్నం మేతకు వెళ్లిన పశువులు.. వర్షం కురుస్తుండటంతో చెట్ల కిందకు వెళ్లాయి. ఆ సమయంలో పిడుగులు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. పశువుల మృతితో రైతులు లబోదిబోమంటున్నారు. భారీ వర్షంతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదలతో ఆళ్లపల్లి మండలం జల్లేరు, గుండాల మండలం కిన్నెరసాని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లాలోని పాల్వంచ, కొత్తగూడెం, గుండాల తదితర మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పలు ఇళ్ల పైకప్పు రేకులు లేచిపోగా, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

ఆంధ్ర ధాన్యం రాకుండా చెక్‌పోస్టు



మిర్యాలగూడ: ఆంధ్ర నుంచి ధాన్యం రాకుండా అడ్డుకునేందుకు జిల్లా యంత్రాంగం చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దుగా ఉన్న నల్లగొండ జిల్లా వాడపల్లి వంతెన వద్ద కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశానుసారం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీఎస్‌వో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చెక్‌పోస్టు ఏ ర్పాటు చేశారు. చెక్‌పోస్టును బుధవారం తహసీల్దార్ గణేష్, ఎస్‌ఐ రవికుమార్, డీటీ ఖాదర్ లు ప్రారంభించారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించేందుకు రెవెన్యూ, వ్యవసాయ, పో లీస్, మార్కెటింగ్ శాఖల అధికారులతో మూ డు బృందాలను నియమించారు. షిఫ్టులవారీ గా ఈ బృందాలు విధులు నిర్వహించనున్నా యి. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతులకు మేలు చేకూర్చడానికి ఆంధ్ర నుంచి ధాన్యం వాహనాల రాకను అడ్డుకునేందుకు ప్రతి సీజన్‌లో మాదిరిగానే ప్రస్తుతం కూడా వాడపల్లి వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం

- భక్తులతో కిటకిటలాడిన ఒంటిమిట్ట

సాక్షి ప్రతినిధి, కడప/ఒంటిమిట్ట: సాక్షి ప్రతినిధి, కడప/ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో వైభవంగా జరుగుతున్న శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. పున్నమి వెన్నెల్లో జరిగిన ఈ కల్యాణాన్ని వేలాదిమంది భక్తులు కనులారా తిలకించి తరించారు. శ్రీసీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన వేలాదిమంది భక్తులకు శ్రీవారి సేవకులు ముత్యంతో కూడిన తలంబ్రాలను పంపిణీ చేశారు. అంతకుముందు శ్రీసీతారాముల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ శోభాయాత్రగా ఆలయం నుంచి కల్యాణవేదికకు తీసుకొచ్చారు. శ్రీకోదండరాముడి కల్యాణం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, కొట్టు సత్యనారాయణ దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.



మాంగల్యాన్ని చూపుతున్న వేదపండితులు

గురుకులంలో విద్యార్థిని ప్రసవం

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన • ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు

నారాయణఖేడ్: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని గురుకుల కళాశాల విద్యార్థిని (16) ఓ శిశువుకు జన్మనిచ్చింది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. గతనెల 24న సిర్గాపూర్ మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని ముళ్లపొదల్లో ఓ శిశువును గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ పసికందుకు ఆస్పత్రిలో చికిత్స చేయించి సంగారెడ్డిలోని బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ముళ్ల పొదల్లో దొరికిన ఆ శిశువు గురుకుల కళాశాలలో విద్యార్థినికి జన్మించిన శిశువుగా ప్రాథమికంగా నిర్ధారణ అయినట్టు తెలుస్తోంది. కళాశాల ప్రిన్సిపాల్ డి.మంజుల బుధవారం మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు.



తమ కళాశాలలో వసతి పొందుతున్న ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని గర్భం దాల్చిందని, గత నెల 24న తెల్లవారు జామున 3.20 గంటలకు బాత్‌రూంలో ఆడ శిశువుకు జన్మనిచ్చిందని తెలిపారు. దీంతో ఆ శిశువుతో పాటు విద్యార్థినిని తల్లిదండ్రులకు అప్పగించినట్టు చెప్పారు.

ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు

ఈ ఘటనపై అంతర్గతంగా విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల ప్రిన్సిపాల్ మంజులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఔట్ సోర్సింగ్‌పై పనిచేస్తున్న డిప్యూటీ వార్డెన్ నజీమా బేగం, స్టాఫ్ నర్సు ఎం.సునీతలను విధుల్లోంచి తొలగించారు. రెండు రోజుల్లో ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించే అవకాశాలు ఉన్నాయని పోలీసువర్గాలు తెలిపాయి.

సిబ్బంది నిర్లక్ష్యం..?: గురుకులంలో వసతి పొందుతూ చదువుకుంటున్న విద్యార్థిని గర్భం దాల్చిన ఘటనలో గురుకుల కళాశాల అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు వస్తున్నాయి. ఆ విద్యార్థిని మానసికంగా, భౌతికంగా దృఢంగా ఉండటంతో ఎవరికీ అనుమానం రాలేదని ప్రిన్సిపాల్ మంజుల తెలిపారు. తర్వాత ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రసవం తర్వాత విద్యార్థినిని, శిశువును తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. తర్వాత వారు శిశువును పొదల్లో వదిలేసినట్టు బయటపడిందని మంజుల పేర్కొన్నారు.

కేటాయింపులకు మించి వాడకం

కుడి కాల్వకు నీటి నిలిపివేత

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ జలాశయంలో కేటాయింపులకు మించి నీటి వాడకం జరిగింది. కృష్ణా నదీ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ) సాగర్ కుడి, ఎడమ కాల్వలకు వానాకాలం, యాసంగి పంటలకు 132 టీఎంసీల చొప్పున నీటిని కేటాయించింది. అయితే కుడి కాల్వ కింద 198.8 టీఎంసీల నీటిని వాడుకోగా, ఎడమ క్వాల కింద ఇప్పటి వరకు 139 టీఎంసీల నీటి వినియోగం జరిగింది. కుడి కాల్వకు ఈ ఏడాది కేటాయించిన నీటికంటే ఎక్కువగా వినియోగిస్తున్న విషయంలో పలుమార్లు కృష్ణానది యాజమాన్య బోర్డు.. నీటిని నిలిపివేయాలని సంబంధిత అధికారులకు ఉత్తర్వులిచ్చినా పట్టించుకోలేదని విమర్శలు ఉన్నాయి. ఎట్టకేలకు ఈనెల 1వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు నీటిని నిలిపివేశారు. ప్రస్తుతం సాగర్ జలాశయం కనీస నీటిమట్టానికి చేరువలో ఉంది. గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.50 టీఎంసీలు)



కాగా.. ప్రస్తుత నీటిమట్టం 528.60 అడుగులు (165.4274టీఎంసీలు)గా ఉంది. కనీస నీటిమట్టం 510 అడుగులు (131.6690 టీఎంసీలు) కావడంతో.. డెడ్ స్టోరేజీకి పైన కేవలం 33.7584 టీఎంసీల నీటిని మాత్రమే వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. ఎడమకాల్వ కింద అవసరాలకు మరో 15 రోజుల పాటు ఈ నీటినే విడుదల చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్‌తో పాటు గ్రామీణ ప్రాంతాలు, పలు పట్టణాలకు తాగునీటిని అందించాల్సి ఉంటుంది. జలాశయంలోకి కొత్తనీరు వచ్చే వరకు తాగునీటి అవసరాలకు ఈ నీరు సరిపోవడం అనుమానంగానే కనిపిస్తోందని ఇంజనీరింగ్ నిపుణులు అంటున్నారు.

'మార్గదర్శి' కేసులో ఏ-2 శైలజ విచారణ నేడు

▶ మొదటి పేజీ తరువాయి

రామోజీరావే నిధుల మళ్లింపు నిజమేనని దాదాపుగా అంగీకరించడంతో ఈ కేసులో సీఐడీ కీలక పురోగతి సాధించినట్లయింది. ఈ నేపథ్యంలోనే ఈ కేసులో ఏ-2గా ఉన్న చెరుకూరి శైలజ కిరణ్‌ను గురువారం విచారించనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. శైలజను హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలోనే విచారించనున్నారు. రామోజీరావు, శైలజ స్టేట్‌మెంట్లను విశ్లేషించిన అనంతరం ఈ కేసులో తదుపరి చర్యలకు ఉపక్రమించాలని సీఐడీ భావిస్తోంది. వారిద్దరినీ ఆంధ్రప్రదేశ్‌కు పిలిపించి మరీ విచారించేందుకు సీఐడీ సంసిద్ధమవుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రాణం తీసిన యువకుడి వేధింపులు

జగిత్యాలలో ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

జగిత్యాలక్రైం: యువకుడి వేధింపులు ఓ యువతి ప్రాణాలు తీశాయి. పెళ్లి చేసుకోవాలని వెంటపడుతుండటంతో తట్టుకోలేక ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద ఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ వీధికి చెందిన మ్యాన రాజశేఖర్-జయశ్రీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె ప్రియాంక (17) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వారి వీధికే చెందిన యువకుడు చేని సంపత్ ఉరఫ్ ఓంకార్... ప్రేమిస్తున్నానంటూ చాలాకాలంగా బాలిక వెంటపడుతున్నాడు. తనను పెళ్లి చేసుకోవాలని నిత్యం వేధిస్తున్నాడు. భరించలేక కుటుంబసభ్యులు గతేడాది డిసెంబర్ 19న పోలీసులను ఆశ్రయించారు. దీంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంపత్‌పై పోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపారు. తర్వాత బెయిల్‌పై విడుదలైన సంపత్ తన పద్ధతి మార్చుకోలేదు. తనను ప్రేమించాలంటూ నిత్యం ప్రియాంక వెంట పడుతూనే ఉన్నాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక.. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూంలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ తర్వాత ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. అప్పటికే ప్రియాంక మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కిశోర్ తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న ప్రియాంక

బాలికపై నలుగురు యువకుల లైంగికదాడి

- గర్భం దాల్చడంతో కప్పిపుచ్చే యత్నం
- నిందితులపై పోక్సో కేసు నమోదు

పెంబి: నిర్మల్ జిల్లా పెంబి మండలం పుల్గంపాండ్రి గ్రామానికి చెందిన బాలిక (17)పై నలుగురు యువకులు లైంగికదాడి చేశారు. బాలిక గర్భం దాల్చడంతో కప్పిపుచ్చే ప్రయత్నంలో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. పుల్గంపాండ్రి గ్రామానికి చెందిన బాలిక కుటుంబ సభ్యులు కొన్ని రోజులుగా జీవనోపాధి కోసం హరిచంద్‌తండా గ్రామానికి వెళ్లి కూలీ పని చేసుకుంటున్నారు. బాలిక మేకల కాపరిగా పనిచేస్తోంది. హరిచంద్‌తండా గ్రామ పంచాయతీ పరిధి తులసీపేట్‌కు చెందిన నలుగురు యువకులు ఆమెను బెదిరించి ఏడు నెలలుగా పలుమార్లు అత్యాచారం చే శారు. కాగా, బాలిక గర్భం దాల్చడాన్ని గమనించిన న లుగురు యువకుల్లో ఒకరు మంగళవారం సాయంత్రం గర్భస్రావానికి సంబంధించిన మాత్రలు ఇవ్వడంతో వేసుకుంది. కొన్ని గంటలకు నొప్పులు రావడంతో మృతశిశువుకు జన్మనిచ్చింది. బాలిక తల్లిదండ్రులు ఆరా తీయగా విషయం చెప్పింది. దీంతో బాలిక తండ్రి పెంబి పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశా రు. నిందితులు నలుగురిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు.

ఇసుక లారీలు వద్దన్నందుకు | మమ్మల్ని బహిష్కరించారు

- రామన్నపేట్ ముదిరాజ్‌ల ఆరోపణ
- జిల్లా మంత్రి ఆదుకోవాలని వేడుకోలు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం రామన్న పేట్ గ్రామంలోని కుంట కింది సంఘం, గడ్డం సంఘం, బొమ్మ సంఘం, ఈర్ల ముదిరాజ్ సంఘాల సభ్యులు 300 మందిని గ్రామ అభివృద్ధి కమిటీ(వీడీసీ) సాంఘిక బహిష్కరణ చేయడం వివాదాస్పదంగా మారింది. బుధవారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో బాధిత సంఘాలకు చెందిన సభ్యులు లింబాద్రి, రుక్మిణి మాట్లాడుతూ.. ఇందుకు సంబంధించిన పూర్వాపరాలను వివరించారు. ''రామన్నపేట గ్రామంలోని కప్పల వాగు నుంచి సంగేమ్ కిషన్ అనే వ్యక్తి ఇసుకను అక్రమంగా భారీ వాహనాలతో తరలిస్తున్నారు. మేము రాత్రిళ్ళు పంట పొలాలు, తోటల్లోని కరెంటు మోటార్ల దగ్గరికి వెళ్లి వస్తుండగా భారీ వాహనాలు పైకి వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముదిరాజ్‌లు నివసించే గల్లీలో నుంచి ఇసుకను తరలించవద్దని వీడీసీ సభ్యులకు విన్నవించాం. అంతే.. మా కులస్తులను గ్రామ బహిష్కరణ చేశారు..'' అని చెప్పారు. గ్రామంలోని కిరాణా షాపులలో నిత్యావసర వస్తువులు కొనుక్కోనివ్వడం లేదని, కిరాయి ఇళ్ల నుంచి ఒకటో తేదీ నాటికి ఖాళీ చేయాలని ఒత్తిడి చే స్తున్నారని తెలిపారు. విద్యార్థులను స్కూల్‌కు పంపిస్తే అక్కడ ఇతర కులస్తుల విద్యార్థులతో మాట్లాడనివ్వడం లేదని, ఆడుకోనివ్వడం లేదన్నారు. ఎవరైనా మాతోమాట్లాడినా, బైకుల పైన వెళ్లినా రూ.లక్ష జరిమానా అంటూ భయపెడుతున్నారని తెలిపారు. కలెక్టర్, పోలీసులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రామన్న పేట్ ముదిరాజ్‌ల సంఘ సభ్యులు

బావాజీ జాతర ఏర్పాట్ల పరిశీలన



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో వెలసిన గురు లోకా మాసంద్ ప్రభు (బావాజీ) జాతర ఉత్సవాలను బుధవారం నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష, కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పరిశీలించారు. గురువారం అర్ధరాత్రి తర్వాత నిర్వహించే రథోత్సవానికి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే గిరిజన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాలు జరిగే 4 రోజులు ఆర్‌డీఓ రాంచందర్ పర్యవేక్షణాధికారిగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. 7వ తేదీన ఆలయం ఆవరణలో రూ. 50లక్షల వ్యయం నిర్మించినున్న బంజారా భవన్ శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు సత్యవతి రాథోడ్, జిల్లా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు రానున్నారని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల ఏర్పాట్లు, శాంతి భద్రత విషయంపై వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. వారి వెంట డీఎస్పీ సత్యనారాయణ, ఆర్‌డీఓ రాంచందర్, నాయకులు బాల్‌సింగ్‌నాయక్, ఆలయ కమిటీ సభ్యుడు గోపాల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీక్ కుట్రదారులను వదిలిపెట్టం



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బీజేపీ
- రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలని బీజేపీ నాయకులు ప్రయత్నిస్తూ, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. బుధవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం పేపర్ లీక్ అంశంలో బీజేపీ నేతల ప్రమేయంపై విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ పథకాలను చూసి ఇతర రాష్ట్రాలు అనుసరిస్తుంటే.. బీజేపీ మాత్రం, తమ రాజకీయ అవసరాల కోసం పేపర్ లీక్ చేసి విద్యార్థులను భయాందోళనలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. హిందీ పేపర్ లీక్ చేసిన బీజేపీ నాయకుడు వెంటనే ఆ పార్టీ అధ్యక్షునికి పేపర్‌ను పంపించడం, ఆయన వెంటనే మీడియాకు సమాచారం అందించడం కుట్రలో భాగమే అన్నారు. పేపరు బయటికి వచ్చిందని తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, కానీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సమాచారం ఎందుకు వెళ్లిందని అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ చేసిన నిందితుడు కూడా బీజేపీ కార్యకర్తనే, ఇప్పుడు పదో తరగతి పేపర్ లీక్ పేరిట బీజేపీ నాయకులు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలని కుట్రలు చేస్తున్నారని అన్నారు. బీజేపీ పరిపాలిత రాష్ట్రాల్లో పేపరు లీక్ చేయడం సర్వసాధారణం, కాబట్టి ఆ కుట్రలను తెలంగాణలో అమలు చేసి ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. పదో తరగతి పేపరు లీకేజీ కుట్రలో ఉన్న ఎవరైనా సరే ఎంతటి వారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తేలేదని అన్నారు. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న కేంద్రం ఆ విషయాన్ని పక్కన పెట్టి ప్రైవేటీకరణ పేరుతో ఉన్న ఉద్యోగాలను కూడా రూల్ ఆఫ్ రిజర్వేషన్ లేకుండా బడుగు, బలహీనవర్గాలకు అన్యాయం చేస్తుందని అన్నారు. పేపరు లీకేజ్ ద్వారా తెలంగాణకు అప్రతిష్ట తెచ్చేందుకు చేస్తున్న కుట్రలను ఆపి రాష్ట్రం అభివృద్ధి కోసం అవసరమైతే కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని హితవుపలికారు.

శనేశ్వరుడికి 257 ఘట్టాలతో తిలతైలాభిషేకం



శనేశ్వరుడి వద్ద హారతి అందుకుంటున్న భక్తులు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌లో వెలసిన జేష్ఠాదేవి సమేత శనేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం 257 మంది దంపతులతో 257 కలశాలలో నువ్వుల నూనెతో స్వామి వారికి మహాన్యాస పూర్వ వేద మంత్రోచ్చరణాల మధ్య అభిషేక కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి నిర్వహించారు. మామిడి, జిల్లేడు, రావి, మర్రి, జమ్మి ఆకులతో పంచ పల్లవులతో కూడిన రుద్రాభిషేకం పూజలు 33 సార్లు ప్రత్యేకంగా జరిపించారు. శని గ్రహ దోష నివారణ జరిగే విధంగా శని, ఈతి బాధలు తొలగడానికి స్వామివారికి అత్యంత శక్తియుక్తంగా ఉండేందుకు ప్రత్యేక మంత్రోచ్చరణాల మధ్య వేద పండితులు పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు, అర్చకులు శాంతికుమార్, మల్లికార్జున్, ఉమ్మయ్య, సాయి సృజన్, సర్పంచ్ సుదర్శన్‌గౌడు, భక్తులు పాల్గొన్నారు.

జోగుళాంబను దర్శించుకున్న ప్రముఖులు



వనపర్తి ఎస్పీ రక్షితమూర్తికి స్వాగతం పలుకుతున్న అర్చకులు



ఆలయంలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రామచంద్రనాయక్

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలలో అయిదవ శక్తిపీఠమైన అలంపురం శ్రీ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో తెలంగాణ అడ్వకేట్ జనరల్ స్పెషల్ జీపీ సంజీవ్‌కుమార్, ఆర్డీఓ రాములు, పశుసంవర్ధక శాఖ సంచాలకులు డా ఎస్ రామచంద్రనాయక్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ డైరెక్టర్ డాయాఆర్ రమేష్, శ్రీనివాస్, విద్యుత్ శాఖ అకౌంట్స్ జనరల్ మేనేజర్ తులసీ రాణి, డీఈ, ఏడీ, ఏఈలు, అలాగే ఏపీ కృష్ణా జిల్లా జడ్జి అరుణసారిక, వనపర్తి జిల్లా ఎస్పీ రక్షితమూర్తి , అలంపూర్ సీఐ సూర్యానాయక్ తదితరులు ఉన్నారు. దేవస్థానం ఈఓ పురందర్‌కుమార్, ఆలయ ముఖ్యఅర్చకులు ఆనంద్‌శర్మ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికి ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు.

ఉమ్మడి జిల్లాలో 12 మంది ఎస్‌ఐల బదిలీలు

మహబూబ్ నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో 12మంది ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ సీసీఎస్ సీఐగా పని చేస్తున్న కె.రామకృష్ణ వికారాబాద్ ఎస్‌బీ సీఐగా బదిలీ అయ్యారు.

ఎస్‌ఐ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పి.విజయ్‌భాస్కర్	భూత్పూర్	మూసాపేట
జి.మాధవరెడ్డి	ఎస్‌బీ నాగర్‌కర్నూల్	అడ్డాకుల
వి.మోహన్‌బాబు	ఎస్‌బీ నాగర్‌కర్నూల్	సీసీకుంట
కె.వెంకటేష్	ఎస్‌ఐ-2 నాగర్‌కర్నూల్	దేవరకద్ర
వై.భాగ్యలక్ష్మీరెడ్డి	సీసీకుంట	ఎస్‌ఐ-2 భూత్పూర్
జి.విజయ్‌కుమార్	అడ్డాకుల	వీఆర్ నాగర్‌కర్నూల్
ఎం.భగవంతురెడ్డి	దేవరకద్ర	ఎస్‌బీ నాగర్‌కర్నూల్
బి.నరేష్	మూసాపేట	ఎస్‌బీ నాగర్‌కర్నూల్
ఎం.గోపాల్	మహబూబ్‌నగర్ ట్రాఫిక్	వీఆర్ నారాయణపేట
ఎస్.పెద్ద అంజయ్య	వీఆర్ నారాయణపేట	వీఆర్ మహబూబ్‌నగర్
కె.సాయికుమార్	సీసీఎస్ మహబూబ్‌నగర్	మహబూబ్‌నగర్ రూరల్
ఎస్.అభిషేక్‌రెడ్డి	టూటౌన్	మహబూబ్‌నగర్ రూరల్

సిర్సనగండ్లలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామ చంద్రస్వామి బ్రహ్మోత్సవాలు బుధవా రం ముగిశాయని ఆలయ చైర్మన్ రామశర్మ, ఈఓ రఘు తెలిపారు. మంగళవారం రాత్రి స్వామివారికి ప్రత్యేక పూజలు, పల్లకీసేవ, అభిషేకం, చక్రతీర్థం, ఏకాంత సేవ, ద్వాదశ ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. చివరిరోజు స్వామివారి దర్శనానికి భక్తులు బారులుతీరారు.



రైల్వే ఉద్యోగం ఇప్పిస్తామని.. తండ్రి, కొడుకు ఘరానా మోసం

ఉండవెల్లి: రైల్వే ఉద్యోగం ఇప్పిస్తామని ఓ తండ్రి, కొడుకుతోపాటు మరో వ్యక్తి కలిసి ఘరానా మోసానికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ బాలరాజు కథనం ప్రకారం.. మండలంలోని తక్కశీలకు చెందిన టి.రామ్మోహన్ అతని కుమారుడు సాయికార్తీక్, మరో వ్యక్తి ఏపీలోని కర్నూలు జిల్లా నిర్మల్‌నగర్‌కు చెందిన వెంకటేష్ కలిసి రైల్వేలో పర్మనెంట్ ఉద్యోగం ఇప్పిస్తామని మారమునగాల-1కు చెందిన శివకుమార్‌తో రూ.14 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో శివకుమార్ విడతల వారీగా రూ.14 లక్షల నగదుతోపాటు ప్లాటు కాగితాలు ఇచ్చాడు. ఆ తర్వాత శివకుమార్‌ను ఏపీలోని గుంటూరు జిల్లాకు నల్లపాడు రైల్వేస్టేషన్‌లో 3 నెలలపాటు డ్యూటీ చేయగా.. మొదటి నెల రూ.29 వేలు, రెండోనెల రూ.18 వేలు జీతం రాగా.. మూడో నెల రాలేదు. దీంతో మూడో వ్యక్తి వెంకటేష్‌కు మళ్లీ రూ.3 లక్షలు ఇచ్చి ఉద్యోగం పర్మనెంట్ చేయించాలని కోరారు. ఇదే విషయమై రామ్మోహన్‌కు ఫోన్ చేసి అడడగా తామే రూ.5 లక్షలు ఇచ్చామని, ప్లాట్ డాక్యుమెంట్‌తో సంబంధం లేదని అలంపూర్ కోర్టు నుంచి లాయర్ నోటీసులు పంపారు. దీంతో తనను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శివకుమార్ ఈనెల 3న ఫిర్యాదు చేయగా బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉండవెల్లి ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

సాగునీరు నిలిపివేత



కాల్వలోకి దిగి కట్ట వేస్తున్న రైతు

కోడేరు: మండలంలోని జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి తాగునీటిని విడుదల చేసిన కేఎల్‌ఐ అధికారులు నాలుగు రోజుల క్రితం సాగునీటిని నిలిపివేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే యాసంగిలో సాగు చేసిన పంటలు చేతి రాకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగిలో వరి, వేరుశనగ, మినుములు పంటలను రైతులు సాగుచేశారు. అధికారులు రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సాగునీరు నిలిపి వేశారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన మరాఠి కైలాస్ అనే రైతు రెండు ఎకరాల వరి పంటను సాగు చేయగా.. నీరు లేక కాల్వలో కట్టలు కట్టి పంటను కాపాడుకుంటున్నాడు. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, కేఎల్‌ఐ అధికారులు స్పందించి మరో 20 రోజులపాటు సాగునీరు విడుదల చేయాలని మండల రైతులు కోరుతున్నారు.